వేప ఉత్పత్తులతో పంటలకు రక్ష

- వేప ఉత్పత్తుల వల్ల తగ్గనున్న ఖర్చులు
- వేపలో ఔషధ గుణాలు మెండు
- ఖర్చు తక్కు, ఆదాయం ఎక్కువ



గుడ్లవల్లేరు: వేప ఉత్పత్తులు ఇటు మానవాళికి అటు వివిధ పంటల రక్షణకు అత్యంత దోహద మవుతున్నాయి. వేప చెట్టులో వేరు మొదలుకొని బెరడు, ఆకులు, పువ్వులు, పండ్లు, విత్తనాలు అన్ని భాగాలు ఔషధ గుణాలు కలిగి ఉంటాయి. ఎరువుల దుకాణదారులు సొమ్ము చేసుకోవటానికి చెప్పే మాటల్ని నమ్మి, విచక్షణా రహితంగా పంటల సాగులో రసాయన, పురుగు మందుల్ని బస్తాల కొద్దీ వాడే పరిస్థితిని వీడాలి. సాగు నేల ఆరోగ్యాన్ని కూడా దష్టిలో పెట్టుకోవాలి. వేప ఉత్పత్తుల్ని సాగులో వాడితే సాగు ఖర్చు ఆదా అవతుంది. ఆశించిన రీతిలో దిగుబడులు వస్తాయి. ముఖ్యంగా నాణ్యమైన, ఆరోగ్యకర మైన ఆహార ఉత్పత్తులు చేతికి అందుతాయి. వేప ఉత్పత్తులు- వాటి ఉపయోగాలపై గుడివాడ వ్యవసాయాధికారి బోలెం అనంతలక్ష్మి ఇస్తున్న సలహాలివి.

వేపతో 300 రకాల కీటకాల నాశనం..

వేపలో అజాడిరాక్టిన్ అనుకూల పదార్థం కలదు. దీనికి 300 రకాల కీటకాలు నల్లిజాతి పురుగులు, చెదలు, భూమిలోని నెమతోడ్సు, కొన్ని రకాల బూజు శిలీంద్రాల్ని అరికట్టే శక్తి ఉంటుంది. ఇది వరి, పత్తి, అపరాలు, కూరగాయలు, పండ్ల మొక్కలు, కాఫీ, జొన్న, ఉద్యాన పంటల్లో వచ్చే కీటకాల్ని అరికడుతుంది. మార్కెట్‌లో వేపపిండి, వేపనూనె, వేప కషాయం వివిధ రకాల వేప ఉత్పత్తులు లభిస్తున్నాయి.

ఉత్పత్తులు పని చేసే విధానం ఇది ..

నీమ్ ఆయిల్‌ను స్థానిక వ్యవసాయ నిపుణుల సూచన మేరకు వాడితే కీటకాల పెరుగుదలను నిరోధిస్తుంది. ఈ మందు స్ప్రే చేసినపుడు పురుగులకు వికారం కలిగించి పైరును తినకుండా చేస్తుంది. విష పూరిత అవశేషాలుండవు. ఈ మందు పక్షులు, మానవులు, మిత్ర పురుగులు, తేనెటీగలు వంటి జీవాలకు హాని చేయదు. శీతాకోక చిలుకలు, తల్లి రెక్కల పురుగులు పెట్టిన గుడ్లు పొదగక ఎక్కువ శాతం చనిపోతాయి. సమగ్ర సస్య రక్షణ విధానంలో ఈ మందులు బాగా ఉపయుక్తమవుతాయి. ఒక మాదిరి వేడి వాతావరణం వలన ఈ మందులు నిరుపయోగం కాకుండా ఉంటాయి. అలా అని బాగా ఎండలో పిచికారీ చేయకూడదు. మందు ప్రభావం తగ్గిపోతుంది. పురుగు మందులు, శిలీంద్ర నాశినులతో కలిపి సురక్షితంగా స్ప్రే చేసుకోవచ్చు.

పిచికారీకి సానుకూల సమయమిది..

పైరుపై పురుగు ఆశించిన వెంటనే పిచికారీ చేయాలి. తల్లి పురుగు గుడ్లు పెట్టినట్లు గమనించిన వెంటనే చేస్తే ఇంకా మంచిది. ఎకరాకు మూడు నుంచి ఐదు మిల్లీలీటర్ల నీమ్ ఆయిల్‌ను లీటరు నీటిలో కలిపి, స్ప్రే చేయాలి. వాతావరణం చల్లగా వున్న సమయాల్లో (ఉదయం లేక సాయంత్రం) పిచికారీ చేయాలి. ఏడు నుంచి 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలి. పిచికారీ చేసిన తర్వాత ఆరు గంటల వ్యవధిలోపు వర్షం పడితే మళ్లీ చల్లాల్సిందే.

వివిధ పంటల్లో తెగుళ్ల నివారణ ఇలా..

వివిధ పంటల్లో వేప మందుల వాడకంతో పలు రకాల చీడపీడల్ని నివారించుకోవచ్చు. వరి పంటకు ఎకరాకు 150 నుంచి 200 కిలోల వేపపిండిని దమ్ములో వేయటం వలన కాండం తొలిచే పురుగు, ఉల్లికోడును అదుపు చేయవచ్చు. వరిపైరుపై లీటరు నీటికి మూడు మిల్లీలీటర్ల చొప్పున కలిపిన ద్రావణాన్ని ఎకరాకు 200 లీటర్ల చొప్పున పిచికారీ చేస్తే అగ్గితెగులు, తొడిమికుళ్లు, పొడతెగులు, వరి తుంగ్రో వైరస్ తెగుళ్లను అదుపు చేసుకోవచ్చు. ఐదు శాతం వేప గింజల కషాయం ఎకరాకు 200 లీటర్ల ద్రావణాన్ని మిర్చి పైరుపై పిచికారీ చేస్తే తెల్లదోమను అరికట్టవచ్చు. తద్వారా మిర్చి మీద వచ్చే జెమినీ వైరస్ తెగులు అదుపులో ఉంటుంది. వేరుశెనగ పైరును ఆశించి ఎక్కువగా నష్టపరిచే తిక్కా ఆకుమచ్చ తెగులు, టమాటో సాగులో ఎండు తెగులును వేపనూనెతో నివారించవచ్చు.

ఇంటిలోనే వేప కషాయం తయారీ...

పంటకు అవసరమైన వేప కషాయాన్ని కూడా ఇంటిలోని మహిళలే తయారు చేసుకోవచ్చు. ఐదు కిలోల వేప గింజలు నలగగొట్టి, ఆరు నుంచి ఏడు లీటర్ల నీటిలో ఒకటి నుంచి రెండు రోజులు నీటిలో నానబెట్టాలి. దీన్ని వస్త్రంలో పోసి, వడకట్టాలి. మరో వంద లీటర్ల నీటిని అందులో కలపాలి.

పోషక విలువలు అపారం..



వేపచెక్కలో నత్రజని 5.6 శాతం, భాస్వరం 1.1 శాతం, పొటాష్ 1.4 శాతం, వేపపిండిలో నత్రజని 2-3 శాతం, భాస్వరం 1.0 శాతం, పొటాష్ 1.4 శాతం చొప్పున పోషక విలువలు ఉన్నాయి. వీటితో పాటు పశువుల ఎరువు వాడుకుంటే పంటలకు మేలు చేకూరుతుంది. వేప గింజల నుంచి నూనె తీస్తారు. నూనె తీయగా వచ్చే వేపచెక్క, ఎండిన వేపకాయల్ని దంచగా వేపపిండి తయారవుతుంది. ఈ పిండిని ఎక్కువగా వరి పంట, నిమ్మ తోటలకు వాడవచ్చు. వేప ఉత్పత్తులను వాడి రైతులు మంచి ఫలితాలు పొందవచ్చు.

– అనంతలక్ష్మి, ఏవో

క్లుప్తంగా

నేటి నుంచి వార్షిక బ్రహ్మోత్సవాలు

గుడివాడ టౌన్: స్థానిక జగన్నాథపురం పాటి మీద వేంచేసియున్న శ్రీ వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 16 నుంచి 21వ తేదీ వరకు నిర్వహిస్తామని ఆలయ ఈఓ నటరాజన్ షణ్ముగం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వార్షికోత్సవాలలో భాగంగా ఈనెల 19వ తేదీ రాత్రి 7.30 గంటలకు స్వామి తిరు కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కల్యాణ మహోత్సవాన్ని తిలకించి స్వామి కృపకు పాత్రులు కావాలని కోరారు.

బాబా మందిర వార్షిక మహోత్సవం



మండవల్లి: స్థానిక శ్రీ దత్త పరం పర షిరిడీ సాయిబాబా మందిరంలో 14వ వార్షిక మహోత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉదయం బాబా వారికి పంచామృతాలతో అభిషేకాలు, విశేష అలంకరణ ఆలయ అర్చకులు నిర్వహించారు. అనంతరం స్థానిక షిరిడీ సాయిబాబా భక్తబృందం సాయినామ సంకీర్తన చేశారు. ఆలయ నిర్వాహకులు గుడివాడ చిట్టిబాబు, బండారు వెంకయ్య, యిన్నా వెంకటేశ్వరరావు, పెరుమాళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాలి



పామర్రు: నూతన ప్రభుత్వ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. గ్రామంలోని 1,4,5 గ్రామ సచివాలయ ఉద్యోగులు ఎమ్మెల్యేను శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఆ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ప్రతి పథకాన్ని ప్రజలలోకి తీసుకువెళ్లే విధంగా పనిచేయాలన్నారు. ప్రభుత్వానికి మంచి పేరు వచ్చే విధంగా సేవలను అందించాలని అన్నారు. జుఝువరం గ్రామ సచివాలయ ఉద్యోగులు ఎమ్మెల్యేను కలిసి అభినందించారు. అనంతరం సచివాలయ ఉద్యోగులు అందరూ కలిసి ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆయా సచివాలయాల ఉద్యోగులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన అధికారులు, సిబ్బంది

స్థానిక ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజాను మండల పరిధిలో వ్యవసాయ శాఖ అధికారి వి.శివ నాగ రాణి, వీఏఏలు కలిసి శుభాభినందనలు తెలిపారు. ప్రస్తుత ఖరీఫ్ ప్రణాళికల గురించి ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం ఎమ్మెల్యేను శాలువాలతో సత్కరించారు.

వృద్ధులకు అన్నదానం

గుడివాడ టౌన్: శ్రీకృష్ణ యాదవ సేవా సంఘం సేవా కార్యక్రమాలలో భాగంగా శనివారం స్థానిక పాటిమీద గల కరుణా పీఠం వృద్ధాశ్రమంలో వృద్ధులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సేవా సంఘం సభ్యుల సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహించినట్లు సంఘం అధ్యక్షుడు పుట్టి హరికుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖుడు బొగ్గారపు తిరుపతయ్య, కె.హరిబాబు, ఎం.సత్యం, జాజుల తాతారావు తదితరులు పాల్గొన్నారు.

100 రోజుల్లో అభివృద్ధి చేసి చూపిస్తా



వివిధ శాఖల అధికారులతో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడివాడరూరల్: పట్టణంతో పాటు నియోజకవర్గాన్ని 100 రోజుల్లో అభివృద్ధి చేసి తన మార్కు చూపిస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. శనివారం గుడ్లవల్లేరు, నందివాడ మండలాల్లోని వివిధ శాఖల అధికారులు ఎమ్మెల్యే రామును కలిసేందుకు పార్టీ కార్యాలయానికి వచ్చారు. పూలబోకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంటికీ సక్రమంగా మంచినీరు అందే విధంగా చర్యలు తీసుకుంటా నన్నారు. కేంద్ర గ్రామీణాభివృద్ధిశాఖ సహాయమంత్రి పెమ్మసాని తనకు సన్నిహితుడని, అతనితో పాటు, రాష్ట్ర ప్రభుత్వంతో కేంద్రం నుంచి కూడా నిధులు తీసుకువచ్చి గ్రామాలను పూర్తిస్థాయిలో అభివృద్ధి చేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, జనసేన నాయకుడు బూరగడ్డ శ్రీకాంత్, రెండు మండలాల వివిధశాఖల ప్రభుత్వ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు మెరుగైన వైద్యం అందజేస్తాం

గుడివాడ టౌన్: గుడివాడ ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కృషిచేస్తానని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. శనివారం ఆయన ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ ఇందిరాదేవితో కలసి సమీక్షా సమావేశం నిర్వహించారు. తొలుత ఆసుపత్రి లోని వివిధ శాఖలను ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. రోగులతో మాట్లాడుతూ వైద్యసేవలు ఏ విధంగా అందుతున్నదీ అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని యంత్రాలు, పరికరాలు, ల్యాబ్‌లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏరియా ఆసుపత్రిలో పనిచేస్తూ డిప్యుటేషన్‌పై ఉన్న వైద్యులందరినీ తిరిగి ఆసుపత్రికి తీసుకువస్తామన్నారు. వైద్యులు విధి నిర్వాహణలో అలసత్వం వహించకుండా సేవలందించాలని కోరారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

శాంతియుతంగా పండుగ జరుపుకోవాలి



కైకలూరులో ముస్లిం మత పెద్దలతో మాట్లాడుతున్న సీఐ ఆకుల రఘు



ముస్లిం పెద్దలతో మాట్లాడుతున్న ఎస్‌ఐ వెంకటకుమార్

ముదినేపల్లి రూరల్: బక్రీద్ పండుగను ముస్లింలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్‌ఐ డి.వెంకటకుమార్ కోరారు. సోమవారం జరగబోయే పండుగ సందర్భంగా మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముస్లిం పెద్దలతో స్టేషన్లో సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల హడావుడి ఇటీవల ముగిసిన సందర్భంగా మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామన్నారు. ముస్లింలు బక్రీద్ పండుగను ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకునేందుకు గాను ముందస్తు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందుకు ముస్లిం పెద్దలు సహకరించి అన్ని మతాల వారితో సామరస్యంగా ఉంటూ పండుగను ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని సూచించారు.

కైకలూరు: బక్రీద్ పర్వదినాన్ని ప్రశాంత వాతావరణంలో ముస్లింలు నిర్వహించుకోవాలని పట్టణ సీఐ ఆకుల రఘు చెప్పారు. ఈ నెల 17న బక్రీద్ సందర్భంగా కైకలూరులో రెండు మసీదుల మతపెద్దలతో టౌన్ స్టేషన్‌లో ముందస్తు అవగాహన సమావేశం శనివారం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ పండగ నేపథ్యంలో మత సామరస్యాన్ని పాటిస్తూ ఇతర మతాలకు ఇబ్బందులు లేకుండా మత ప్రార్థనలను నిర్వహించుకోవాలన్నారు. ట్రాఫిక్‌కు ఎటువంటి అంతరాయం కలిగించవద్దన్నారు. సోషల్ మీడియా మాధ్యమాలలో ఇతర మతాలను రెచ్చగొట్టే పోస్టులను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో టౌన్ ఎస్‌ఐ ఎంఆర్‌డీ రాజు పాల్గొన్నారు.

బాలబాలికలు పనిలో కాదు.. బడిలో చేరాలి



ముదినేపల్లి జెడ్పీహైస్కూల్ వద్ద ర్యాలీ ప్రారంభిస్తున్న ఎంఈఓ, ఉపాధ్యాయులు

కైకలూరు/కలిదిండి: బడి ఈడు పిల్లలు పనులలో కాకుండా పాఠశాలల్లో చేర్పించడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కైకలూరు, కలిదిండి మండల ఎంఈవోలు డి.రామారావు, వి.శ్రీనివాసరావు, పి.ప్రభాకరరావు చెప్పారు. గ్రామాల్లో 6-14 ఏళ్ల వయస్సు గల బాలబాలికలను గుర్తించి వారిని బడిలో చేర్పించేందుకు ప్రభుత్వం అమలు చేస్తున్న 'నేను బడికి పోతా' కార్యక్రమం కైకలూరు బాలికల ఉన్నత పాఠశాల, కలిదిండి మండలం భాస్కరరావుపేట ఉన్నత పాఠశాలల్లో శనివారం జరిగింది. మొదటి రోజు ఆయా పాఠశాలల్లో బడి ఉత్సవం, బాలికా ఉత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ 6 సంవత్సరాల వయసు నుంచి 14 సంవత్సరాల లోపు వయసు బాలబాలికలను 100 శాతం పాఠశాలలో చేర్చడమే లక్ష్యంగా ఈ కార్యక్రమం జరుగుతోందన్నారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో ఈ నెల 13 నుంచి జూలై 12 వరకు ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. ఇందుకు మండల స్థాయి, గ్రామస్థాయి, జిల్లా స్థాయి కమిటీలు నియమించారన్నారు. మండల స్థాయి కమిటీలో చైర్మన్‌గా ఎంపీడీవో, కన్వీనర్‌గా ఎంఈఓ, మరో 10 మంది సభ్యులు, గ్రామ స్థాయి కమిటీలో చైర్మన్‌గా పేరెంట్స్ కమిటీ చైర్మన్, కన్వీనర్‌గా హెచ్‌ఎం, మరో ఏడుగురు సభ్యులు ఉంటారన్నారు. ఈ నెల 18న ప్రత్యేక అవసరాలు కలిగిన బాలలను గుర్తించి భవిత కేంద్రాల్లో చేర్పించడం, 19న విద్యాసదస్సు, 20న సమాజంతో ఒక రోజు వంటి కార్యక్రమాలు జరుగుతాయన్నారు. జూలై 11 వరకు ఇంటింటికీ తిరిగి బాలబాలికలను గుర్తిస్తామన్నారు.



భాస్కరరావుపేటలో విద్యార్థుల ర్యాలీలో ఎంఈవో

ముదినేపల్లి రూరల్: బడి ఈడు పిల్లలంతా పాఠశాలల్లోనే ఉండేలా చూడాలని కోరుతూ ఉపాధ్యాయులు అవగాహన ర్యాలీని ముదినేపల్లిలో శనివారం నిర్వహించారు. ఎంఈఓ కె.నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో 'నేను బడికి పోతా' అనే పేరుతో పలువురు ఉపాధ్యాయులు స్థానిక జెడ్పీ హైస్కూల్ నుంచి విద్యార్థులతో ర్యాలీ జరిపారు. ఈ సందర్భంగా ఎంఈఓ కే నరేష్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో బడి బయట ఉన్న పిల్లలను గుర్తించి బడిలో చేర్పిస్తామన్నారు. వయస్సుల వారీగా వారి తరగతులను నిర్ణయించి పాఠశాలల్లో ప్రవేశాలు కల్పిస్తామని చెప్పారు. బడి ఈడు పిల్లలందరినీ బడిలో చేర్పించడంతో పాటు బడి బయట పిల్లలు లేని గ్రామాలుగా మండలాన్ని తీర్చిదిద్దేందుకు స్థానిక ప్రజాప్రతినిధులు ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో ర్యాలీని నిర్వహించారు.

కొండముచ్చులను అరికట్టండి



పామర్రు: గ్రామంలో కొండముచ్చులు పెట్రేగిపోతున్నాయి. గ్రామంలో కొండముచ్చుల గుంపులు ఇళ్ల పైకిచేరి హల్‌చల్ చేస్తూ ప్రజలను భయ భ్రాంతులకు గురిచేస్తున్నాయి. రహదార్లపై వెళ్లే వారిని భయపెడుతున్నాయి. ఇళ్లల్లో దూరి ఆహార పదార్థాలను ఎత్తుకు పోతున్నాయి. ఒంటరిగా ఎవరైనా కనబడితే వారిపై పడి గాయపరుస్తున్నాయి. నాయీ బ్రాహ్మణ వీధిలో ఒంటిరిగా ఉన్న ఒక వ్యక్తిపై దాడి చేశాయి. ఎవరైనా వాటిని అదిలిస్తే తిరగబడుతున్నాయి. యలమర్రురోడ్డులోని ఓ ఇంట్లోకి ప్రవేశించి ఆహారం ఎత్తుకు పోతున్న కొండముచ్చులను ఇంట్లో ఉన్న మహిళ వెంబడించగా ఆమెపై తిరగబడి ఆమెను గాయ పర్చాయి. రహదార్లపై అడ్డంగా గుంపులుగా చేరి బాటసారులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పంచాయతీ అధికారులు స్పందించి గ్రామంలోని కొండముచ్చుల సమస్యను పరిష్కరించానలి ప్రజలు కోరుతున్నారు.

ఆవును వెతికేందుకు వెళ్లి అదృశ్యమయ్యాడు

ముదినేపల్లి రూరల్: తప్పిపోయిన ఆవును వెతికేందుకు వెళ్లిన తండ్రి తిరిగి రాలేదంటూ కుమారుడు స్థానిక పోలీసుస్టేషన్లో ఫిర్యాదు చేసిన వైనమిది. పోలీసులు కథనం ప్రకారం పశ్చిమగోదావరి జిల్లా అత్తిలి మండలం పాలూరు గ్రామానికి చెందిన దండు వెంకట సూర్యనారాయణరాజు గుడివాడ మండలం దొండపాడు గ్రామంలో చేపల చెరువు కాపలాదారుడిగా పనిచేస్తున్నాడు. సూర్యనారాయణరాజు తండ్రి శ్రీరామరాజు (76) తల్లితో కలిసి ముదినేపల్లి మండలం దేవరంలో చెరువుపై కాపలా ఉంటున్నాడు. ఈ క్రమంలో ఈ నెల 13న చెరువుపై కాపలా ఉండగా ఆవు తాడు తెంపుకొని వెళ్లిపోవడంతో దానిని వెతికేందుకు వెళ్లిన తండ్రి శనివారం వరకు తిరిగి రాలేదని స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఆవు వచ్చినప్పటికీ తండ్రి జాడ లేదని ఫిర్యాదులో పేర్కొన్నాడు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఉపాధి పనుల నిర్వహణ

మండవల్లి: మండలలోని అల్లినగరంలో పంట కాలువలో పూడిక తొలగింపు పనులు శనివారం నిర్వహించారు. జాతీయ ఉపాధి హామీ పథకం కింద రూ.59 వేల విలువైన పనిని 36 మంది కూలీలతో శనివారం పంట కాలువ పూడిక తొలగింపు పనులు నిర్వహించినట్లు ఎంటీఏ ఎస్.నవీన్ చెప్పారు. ఆయన మాట్లాడుతూ కాలువలో పూడిక తొలగింపు పనుల వల్ల రైతుల పంట పొలాలకు సమృద్ధిగా సాగు నీరు అందుతుందన్నారు. తాగునీటి , పశువుల చెరువులు నిండుతాయన్నారు.ఫీల్డ్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

పచ్చిరొట్ట పైర్లతో భూసారం మెండు

డీఆర్‌సీ ఏడీఏ కొర్రపాటి శ్రీనివాసరావు



గుడివాడరూరల్: ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో పంట పొలాలకు భూసారాన్ని పెంచేందుకు పచ్చిరొట్ట పైరు వల్ల చాలా ఉపయోగాలు ఉంటాయని డీఆర్‌సీ ఏడీఏ కొర్రపాటి శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలోని బొమ్ములూరు గ్రామంలో రైతులు పంట పొలాల్లో సాగు చేసిన పచ్చిరొట్ట పంటను గుడివాడ వ్యవసాయశాఖ ఏడీఏ నిమ్మగడ్డ రమాదేవి, ఏవో పద్మజ, ఎంఏవో బోలెం అనంతలక్ష్మిలతో కలసి ఆయన పరిశీలించారు. పచ్చిరొట్ట పంట వల్ల పంట పొలాలకు కలిగే ప్రయోజనాలు, ఉపయోగాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం మరికొద్దిరోజుల్లో ఖరీఫ్ సాగు మొదలు కానున్న నేపథ్యంలో పచ్చిరొట్ట పంటను పంట పొలాల్లో ఎరువుగా వినియోగిస్తే భూసారం పెరగడంతో పాటు దిగుబడులు కూడా పెరుగుతాయని రైతులకు వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ విధానాన్ని అవలంభించడం వల్ల దిగుబడులు చాలా పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, సిబ్బంది, బొమ్ములూరు గ్రామ రైతులు పాల్గొన్నారు.

పీఎంశ్రీ పాఠశాలగా బంటుమిల్లి జెడ్పీహెచ్‌ఎస్

బంటుమిల్లి: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల(జెడ్పీహెచ్‌ఎస్)ను కేంద్ర ప్రభుత్వం పీఎంశ్రీ పాఠశాలగా ఎంపిక చేసిందని హెచ్‌ఎం బీవీ వెంకట్రావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం గ్రామ స్థాయి నుంచి నాణ్యమైన సాంకేతిక విద్యను అందించడానికి పీఎంశ్రీ పథకాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా 2024-25 సంవత్సరం నుంచి పాఠశాలలో కంప్యూటర్, ఎలక్ట్రానిక్ విద్యా బోధన 8,9 తరగతుల విద్యార్థులకు అందుతుందని హెచ్‌ఎం తెలిపారు. దీని కోసం ఇద్దరు కంప్యూటర్ ఉపాధ్యాయులను నియమించినట్లు ఆయన చెప్పారు. ఎన్‌సీసీ శిక్షణ కూడా ప్రారంభిస్తున్నట్లు వెంకట్రావు తెలిపారు.

బస్టాండ్‌లో షాపుల వేలం

అవనిగడ్డ: అవనిగడ్డ ఆర్టీసీ డిపో పరిధిలోని బస్టాండ్‌లో ఉన్న షాపులకు వేలం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ హనుమంతరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అవనిగడ్డ బస్ స్టేషన్‌లో పలు వ్యాపారాల కోసం ఖాళీ స్థలాలు, ఫ్రూట్స్ అండ్ జ్యూస్, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్, ఫ్రూట్స్ అండ్ ఫ్రూట్స్ జ్యూస్, బస్ స్టేషన్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో ఏదైనా అనుమతించిన వ్యాపారం, చల్లపల్లి బస్టాండ్‌లో టీ అండ్ సమోసా, రెండు గోడౌన్లు, రెండు ఖాళీ స్థలాలు, ఎలక్ట్రికల్ పెయింట్స్, నాగాయలంకలో ఒక షాపు, మొవ్వలో సైకిల్ అండ్ స్కూటర్ స్టాండ్, పలు వ్యాపారాల కోసం నాలుగు ఖాళీ స్థలాలు, కూచిపూడిలో పలు వ్యాపారాలకు నాలుగు ఖాళీ స్థలాలు, మోపిదేవిలో రెండు స్థలాలు వ్యాపారాల కోసం వినియోగించుకోవచ్చని చెప్పారు. ఈనెల 15వ తేదీ నుంచి 27వ తేదీ మధ్య టెండర్ ఫారాలు అందుబాటులో ఉంటాయని, 28వ తేదీన మచిలీపట్నంలో జరిగే టెండర్ల ప్రక్రియలో ఆసక్తి ఉన్నవారు పాల్గొనవచ్చని డీఎం సూచించారు. మరిన్ని వివరాలకు 73828 96721 నంబర్‌కు సంప్రదించాలని కోరారు.

చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్పించండి

సీడీపీవోలు భానుశ్రీ, విజయ ఫ్లోరెన్స్



చౌటపల్లి గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో సీడీపీవో విజయఫ్లోరెన్స్, సిబ్బంది

కురుమద్దాలి(పామర్రు): మూడేళ్ల ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రాలలో చేర్పించి వారి ఉజ్వల భవిష్యత్‌కు పునాదులు వేయాలని ఐసీడీఎస్ పామర్రు ప్రాజెక్టు సీడీపీవో వి.భానుశ్రీ అన్నారు. మండల పరిధిలోని కురుమద్దాలి గ్రామంలోని అంగన్‌వాడీ-2 వద్ద అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా భానుశ్రీ మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారుల సర్వతోముఖాభివృద్ధికి తోడ్పడేవిధంగా అనేక విద్యా సంబంధమైన అంశాలు, శారీరక సౌష్టవం పెంపొందే శిక్షణ ఇవ్వడం జరుగుతుందని అన్నారు. వీటిని సద్వినియోగం చేసుకునే విధంగా ప్రతి చిన్నారిని కేంద్రాలలో చేర్పించాలని కోరారు. అంగన్‌వాడీలలో ఐదేళ్లు పూర్తిచేసిన చిన్నారులకు సర్టిఫికెట్లను అందించి వారిని స్థానికంగా ఉన్న ప్రాథమిక పాఠశాలలో చేర్పించేలా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఈ విషయమై కేంద్రాల పరిధిలోని తల్లులకు అవగాహన కల్గించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో పామర్రు సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.విజయకుమారి, జీఎంఎస్‌కే సుకన్య, అంగన్‌వాడీ కార్యకర్తలు కె.విజయలక్ష్మి, డి.భవాని, తల్లులు, చిన్నారులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

గుడివాడరూరల్: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణతో కూడిన విద్యను చిన్నారులు అలవర్చుకోవాలని ఐసీడీఎస్ సీడీపీవో విజయఫ్లోరెన్స్ పేర్కొన్నారు. మండలంలోని లింగవరం, బిళ్లపాడు, చౌటపల్లి గ్రామాల్లో శనివారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకల్లో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీల్లో చిన్నారులకు కావాల్సిన అన్ని వసతులతో పాటు మెరుగైన విద్యను కూడా అందిస్తుందన్నారు. నాణ్యతా ప్రమాణాలతో కూడిన పోషకాహారాన్ని చిన్నారులకు అందజేస్తుందన్నారు. తల్లిదండ్రులందరూ చిన్నారులను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని సూచించారు. చిన్నారులకు విద్యతో పాటు ఆటపాటలు కూడా నేర్పించేందుకు అంగన్‌వాడీలు దోహదపడతాయని సీడీపీవో పేర్కొన్నారు. ఆయా కార్యక్రమాల్లో సెక్టార్ సూపర్‌వైజర్ ఎండీ నసీరూన్నీసా, ఏసీడీపీవో ఎం.పద్మావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు ఉమ, లీల, రత్నకుమారి, బి.తులసమ్మ, బి.రామలక్ష్మి, సిబ్బంది, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



కురుమద్దాలిలో సర్టిఫికెట్లు స్వీకరించిన చిన్నారులతో సీడీపీవో భానుశ్రీ, తదితరులు